క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో వీరబ్రహ్మేంద్ర స్వామి జయంతి


పూజలు చేస్తున్న భక్తులు, విశ్వబ్రాహ్మణులు

పత్తికొండ(తుగ్గలి): కాలజ్ఞాన ప్రబోధకర్త, సంఘ సంస్కర్త మద్విరాట్ శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 416వ జయంతి వేడుకలను బుధవారం పత్తికొండలో ఘనంగా నిర్వహించారు. తేరుబజారులోని వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో వేకువజామునే భక్తులు, విశ్వబ్రాహ్మణులు వెళ్లి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ పూజారి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో బ్రహ్మయ్యచారి, నరసింహారెడ్డి, కాలయ్యాచారి, శంకరయ్యాచారి, నరసింహాచారి, ఆనందాచారి, మహానందాచారి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుంటాం


స్థానిక అధికారులు, ప్రజలతో మాట్లాడుతున్న ఆర్డీఓ భరత్‌నాయక్

దేవనకొండ: ఎవరైనా అక్రమంగా ప్రభుత్వ భూములను అనుభవిస్తుంటే వెంటనే విచారణ చేపట్టి స్వాధీనం చేసుకుంటామని పత్తికొండ ఆర్డీఓ భరత్‌నాయక్ తెలిపారు. దేవనకొండలోని టర్నింగ్ వద్ద కుంకనూరు రెవెన్యూ పరిధిలోని దాదాపు 30 ఎకరాలను రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్లాట్లుగా మార్చడం జరిగిందని, సర్వే నంబర్‌లో 591లో 6.59 ఎకరాలు ప్రభుత్వ భూమి కూడా కలిసిందని ఆర్డీఓ దృష్టికి పలువురు తీసుకెళ్లారు. స్పందించిన ఆర్డీఓ వెంటనే బుధవారం ఆ స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వ స్థలాలను గుర్తించాలని, దీనిపై సమగ్ర విచారణ జరపాలని స్థానిక తహసీల్దార్‌ను ఆదేశించారు.

కార్తీక వన భోజనం


కార్తీక వన భోజనం కార్యక్రమంలో పాల్గొన్న స్థానికులు

హొళగుంద: కార్తీక మాసం సందర్భంగా స్థానిక శ్రీరాంనగర్ క్యాంప్‌నకు చెందిన ప్రజలు బుధవారం అశ్వర్థనారాయణ పూజలో భాగంగా వన భోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. క్యాంపులోని మహిళలు, యువతీ యువకులు రావి, వేప చెట్టుకు పుష్పార్చన, నైవేద్య సమర్పణ తదితర కార్యక్రమాలను అత్యంత వైభవంగా జరిపారు. అనంతరం కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో క్యాంప్ పెద్దలు జంబప్ప, శరత్‌బాబు, నాగేశ్వరరావు, నీలకంఠస్వామి, బాబు, బసవ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తులసి పూజ


ప్రత్యేకంగా అలంకరించిన తులసి కోట

మద్దికెర: కార్తీక మాసం ద్వాదశి సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో మహిళలు భక్తిశ్రద్ధలతో తులసి పూజలు నిర్వహించారు. భారతీయ సంప్రదాయం ప్రకారం తులసి చెట్టును శ్రీమహాలక్ష్మిగా, ఉసిరి చెట్టును శ్రీమహావిష్ణువుగా భావిస్తారు. అందుకే తులసి కోటలో ఉసిరి చెట్టు కొమ్మ ఉంచి పూజలు చేశారు. కోట ముందు ముగ్గులు వేసి కోట చుట్టూ చీరతో అలంకరించారు. అనంతరం చెట్టుకు ఎర్ర గాజులు, కుంకుమ దిద్దారు. నువ్వుల నూనెతో దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు విష్ణు స్తోత్రం పఠించారు. ద్వాదశి నాడు తులసి పూజ చేస్తే సమస్త పాపాలు నశిస్తాయని..ఆయురారోగ్యాలు, సిరిసంపదల సిద్ధిస్తాయని భక్తుల నమ్మకం.

కిలో టమాట రూ.22



పత్తికొండ(తుగ్గలి): రోజురోజుకు టమాట ధర పడిపోతోంది. కొద్ది రోజుల క్రితం వరకు కిలో టమాట రూ.33 పలికింది. క్రమంగా తగ్గుతూ వస్తోంది. బుధవారం పత్తికొండ వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో కిలో టమాట గరిష్ఠ ధర రూ.22, కనిష్ఠం రూ.12, సరాసరి రూ.17 పలికింది. 563 క్వింటాళ్ల టమాట పంట ఉత్పత్తులను రైతులు యార్డుకు తీసుకొచ్చారు.

బాలలు.. ప్రతిభా వెలుగులు

- చిరు ప్రాయంలోనే ఆటల్లో సత్తా చాటుతున్న చిన్నారులు
- రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ
- నేడు బాలల దినోత్సవం

పిల్లలు.. ప్రతిభకు లేవు ఎల్లలు అని నిరూపిస్తున్నారు. క్రీడల్లో సత్తా చాటుతున్నారు. పలు క్రీడల్లో రాణిస్తూ ఊరికి, పాఠశాలకు మంచి పేరు తీసుకొస్తున్నారు. వివిధ పోటీల్లో చిచ్చర పిడుగుల్లా చెలరేగి పతకాలు కైవసం చేసుకుంటున్నారు. రాష్ట్ర, జాతీయ వేదికల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి విజేతలుగా నిలుస్తున్నారు. అవార్డులు సాధిస్తూ చాచా నెహ్రూ కలలను సాకారం చేస్తూ.. భావిభారత పౌరులుగా సగర్వంగా కీర్తిపతాకం ఎగురవేస్తున్నారు. గురువారం బాలల దినోత్సవం సందర్భంగా వివిధ క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులపై ప్రత్యేక కథనం.

– కృష్ణగిరి

నెట్‌బాల్, రగ్బీలో రాణిస్తూ..



కృష్ణగిరి మండల పరిధిలోని బోయబొంతిరాళ్ల గ్రామానికి చెందిన భాస్కర్‌నాయుడు, మదనసౌందర్య దంపతుల కుమార్తె మానస స్థానిక కస్తూర్బా విద్యాలయంలో ఇంటర్ చదువుతోంది. ఆరో తరగతి నుంచి ఇదే పాఠశాలలో చదువుతూ అన్ని రంగాల్లో రాణిస్తూ శభాష్ అనిపించుకుంటోంది. ముఖ్యంగా నెట్‌బాల్, రగ్బీలో సత్తా చాటుతోంది. పీఈటీ సుప్రియతోపాటు ప్రిన్సిపాల్ చైతన్యప్రవంతి ప్రత్యేక చొరవ చూపడంతో చదువుతోపాటు క్రీడల్లో ప్రతిభ కనబరుస్తోంది. రెండు పోటీల్లో జిల్లా, రాష్ట్రస్థాయిలో పాల్గొని ప్రథమ, ద్వితీయ స్థానాల్లో రాణించింది.

ఐఏఎస్ కావాలనే లక్ష్యంతో..



కృష్ణగిరి మండలం మన్నెకుంట గ్రామానికి మల్లికార్జున, అనిత దంపతుల కుమార్తె విశాలాక్షి మల్టీ టాలెంటెడ్. కృష్ణగిరి కస్తూర్బా విద్యాలయంలో పదో తరగతి చదువుతోంది. పలు విభాగాల్లో విశేష ప్రతిభ కనబరుస్తోంది. అర్చరీ, ఉడ్‌బాల్, రోప్ స్కిప్పింగ్, హైజంప్ పోటీల్లో రాణిస్తూ జిల్లా, రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించింది. 2022లో వైఎస్సార్ కడప జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి ఉడ్‌బాల్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. అలాగే 2022, 2023లో పార్వతీపురం మన్యం జిల్లాలో జరిగిన అర్చరీ, 2023లో గుంటూరులో జరిగిన హైజంప్ పోటీలు, 2023లో కర్నూలులో జరిగిన రోప్ స్కిప్పింగ్ పోటీల్లో ద్వితీయస్థానంలో రాణించి అందరి మన్ననలు పొందింది. చదువుతోపాటు క్రీడల్లో రాణించి భవిష్యత్తులో ఐఏఎస్ చదివి పేదలకు సేవా చేయాలనేదే తన లక్ష్యమని పేర్కొంది.

అంతర్జాతీయ స్థాయిలో పాల్గొనడమే లక్ష్యం



చదువు, క్రీడలు రెండు కళ్లలా చేసుకుంటూ జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటుతోంది కృష్ణగిరి మండలం బావనదొడ్డి గ్రామానికి చెందిన చెన్నయ్య, సుభద్ర దంపతుల కుమార్తె ఎం.గాయత్రి. వీరిది వ్యవసాయ కుటుంబం. గాయత్రీ కృష్ణగిరి కస్తూర్బా విద్యాలయంలో చదువుతోంది. చదువులో చురుగ్గా ఉంటూనే స్కిప్పింగ్, ఆటల్లో సత్తా చాటుతోంది. 2022లో కర్నూలులో జరిగిన స్కిప్పింగ్, అదే ఏడాది చిత్తూరులో జరిగిన రాష్ట్రస్థాయి స్కిప్పింగ్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. 2023లో నెల్లూరు జరిగిన ఆట్యాపాట్య పోటీల్లో, 2024లో తూర్పు గోదావరిలో జరిగిన స్కిప్పింగ్‌లో, అలాగే గుంటూరులో జరిగిన జాతీయ స్థాయి స్కిప్పింగ్‌లో ద్వితీయస్థానంలో రాణించింది. త్వరలో గోవాలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననుంది.

నేడు అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

హాలహర్వి: గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, బ్లాక్ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక 2025–26పై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఒక్క రోజు మండలస్థాయి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వరలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ఈ శిక్షణలో గ్రామ, మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలన్నారు.

17 నుంచి పంటల నమోదు

తుగ్గలి: రబీ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటల వివరాలను ఈనెల 17వ తేదీ నుంచి నమోదు చేయనున్నట్లు తుగ్గలి, పత్తికొండ వ్యవసాయశాఖ అధికారులు పవన్‌కుమార్, వెంకటరాముడు బుధవారం తెలిపారు. పంటలు సాగుచేసిన రైతులందరూ తమ పరిధిలోని రైతు సేవా సిబ్బందిని సంప్రదించి పంట సాగు వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. అదే విధంగా ఫసల్ బీమా, వాతావరణ బీమాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పప్పు శనగకు రూ.420, వేరుశనగకు రూ.480, జొన్న రూ.297, ఉల్లి రూ.1,350, టమాట పంటకు రూ.1,500 ప్రీమియంను డిసెంబర్ 15వ తేదీలోపు, వరికి రూ.630 ప్రీమియంను డిసెంబర్ 31లోపు చెల్లించాలన్నారు.

ఇది ప్రజలందరి విజయం

దేవనకొండ: ప్రజల పోరాటం నేపథ్యంలో యురేనియం తవ్వకాలు నిలిపివేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించిందని, ఇది ప్రజలందరి విజయమని అఖిలపక్ష రాజకీయ పార్టీల నాయకులు అన్నారు. ప్రభుత్వ ప్రకటనను స్వాగతిస్తున్నామని, ప్రజలకు మరింత భరోసా కల్పించాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద సీపీఐ మండల కార్యదర్శి నరసరావు, సీపీఎం జిల్లా నాయకులు బి.వీరశేఖర్, వెలమకూరు సర్పంచ్ భాస్కర్, రైతు సంఘం నాయకులు సూరి తదితరులు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ యురేనియం తవ్వకాల నేపథ్యంలో మండల ప్రజలు తీవ్ర ఆందోళనకు గురై ఉధృతమైన పోరాటం చేశారన్నారు. దీంతో ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగి యురేనియం తవ్వకాలను నిలుపుదల చేస్తున్నట్లు ప్రకటన చేసిందన్నారు. పోరాటంలో అండగా నిలిచిన మీడియాకు, విద్యావంతులు, మేధావులు, విద్యార్థులు, యువకులు, మహిళలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం


మాట్లాడుతున్న ఆర్డీఓ భరత్‌నాయక్

పత్తికొండ(తుగ్గలి): స్కానింగ్ సెంటర్లలో లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని పత్తికొండ ఆర్డీఓ ఎస్ భరత్‌నాయక్ అన్నారు. బుధవారం తన చాంబర్‌లో పీసీ పీఎన్‌డీటీ చట్టంపై సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. లింగ నిర్ధారణ చేసి చెప్పాలని అడిగిన వారు, ప్రోత్సహించిన వారు శిక్షార్హులవుతారన్నారు. స్కానింగ్ కేంద్రాలన్నీ తప్పనిసరిగా నమోదు చేసుకోవడంతో పాటు రెన్యూవల్ చేసుకోవాలని స్పష్టం చేశారు. స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు గర్భిణుల వివరాలు తప్పక నమోదు చేయాలన్నారు. ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తామని, నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టరీత్యా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అదే విధంగా బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో సీఐ జయన్న, పీసీ పీఎన్‌డీటీ జిల్లా నోడల్ అధికారి నాగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గురువులది ఎప్పటికీ గొప్ప స్థానమే


ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఖాజాబేగ్‌ను సన్మానిస్తున్న టీచర్లు

వెల్దుర్తి(కృష్ణగిరి): సమాజంలో గురువులది ఎప్పటికీ గొప్ప స్థానమే అని వక్తలు కొనియాడారు. మండల పరిధిలోని ఎస్. బోయినపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు స్వీకరించిన హిందీ పండిట్ ఖాజాబేగ్‌ను బుధవారం ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. బతకలేక బడిపంతులు అనే నానుడి నుంచి బతికితే బడి పంతుల్లా బతకాలనే స్థితికి తీసుకొచ్చిన ఘనత గురువుదేనన్నారు. సమాజంలో గురువుల స్థానాన్ని ఎవరూ పూడ్చలేరన్నారు. రాజకీయాలకు అతీతంగా సమాజ హితం కోసమే గురువులు పాటుపడాలని విజ్ఞప్తి చేశారు. పిల్లల్లో జ్ఞానాన్ని పెంపొందించి జీరో స్థానం నుంచి హీరో స్థానానికి తీసుకెళ్లేది గురువులేనన్నారు. తమ పాఠశాల ఉపాధ్యాయుడు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, నర్సింగ్ కాంతారెడ్డి, నాగసుదర్శన్‌శెట్టి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు


ఎంఈఓ కోమలా దేవికి వారోత్సవాల పోస్టర్ అందిస్తున్న ఆలూరు గ్రంథాలయ అధికారి భాస్కర్

ఆలూరు రూరల్: గురువారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు 57వ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలూరు గ్రంథాలయ అధికారి భాస్కర్ తెలిపారు. గురువారం ఆయన మండల ఎంఈఓ కోమలా దేవికి గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభ ఆహ్వాన పత్రిక అందించారు. ఆయన మాట్లాడుతూ..ఆలూరు, మొలగవల్లి శాఖా గ్రంథాలయాల్లో వారం రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలకు పాఠకులు, ప్రముఖులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. వారోత్సవాల్లో భాగంగా బాలల దినోత్సవం, పుస్తక ప్రదర్శన, వ్యాస రచన పోటీలు, క్విజ్, వక్తృత్వ, క్రీడల పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

పత్తికొండ(తుగ్గలి): గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో గురువారం నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ గ్రంథాలయాధికారి విశ్వనాథరెడ్డి తెలిపారు. 14న బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, మాదకద్రవ్యాలపై అవగాహన, పుస్తక పఠన ప్రాముఖ్యత, 16న గ్రంథ పాలకుల సదస్సు, 17న కవి సమ్మేళనం, 18న విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్, క్రీడాపోటీలు, 19 మహిళా దినోత్సవం, 20న డిజిటల్ గ్రంథాలయాలపై అవగాహన కల్పిస్తామన్నారు.

భజన పోటీల విజేత కడమకుంట్ల


మొదటి బహుమతి అందుకుంటున్న కడమకుంట్ల భజన బృందం సభ్యుడు

ఆస్పరి: మండలంలోని అట్టికల్లు గ్రామంలో పరదేశప్ప తాత ఆరాధనోత్సవాల సందర్భంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి భజన పోటీల్లో తుగ్గలి మండలం కడమకుంట్ల భజన జట్టు విజేతగా నిలిచింది. గెలుపొందిన భజన జట్లకు బుధవారం గ్రామ పెద్దలు, దాతలు బహుమతులను అందజేశారు. మొదటి బహుమతి గెలిచిన కడమకుంట్ల జట్టుకు రూ.14,400, రెండవ స్థానంలో నిలిచిన కట్టకింద పల్లెకు రూ.11,700, మూడు హలిగేరకు రూ.9,999, నాలుగు, ఐదు స్థానాలలో సమానంగా పాయింట్లు తెచ్చుకున్న గుత్తిఆర్‌ఎస్, కడిమెట్ల జట్లుకు రూ.17,100, ఆరు ముకుందాపురంకు రూ.7,200, ఏడు దొడగొండకు రూ.6,300, ఎనిమిదవ స్థానంలో నిలిచిన ఐనకల్లు జట్టుకు రూ.5,400, తొమ్మిది, పదవ స్థానంలో సమానంగా పాయింట్లు తెచ్చుకున్న చిన్నహుల్తి, బండగట్టు జట్లుకు రూ. 8,100, 11వ స్థానంలో నిలిచిన నార్పల జట్టుకు రూ.2,700, 12వ స్థానంలో నిలిచిన లక్ష్మంపల్లికి రూ.1,800 బహుమతులను అందజేశారు. ఉత్తమ హార్మోనిస్టుగా కాశీవిశ్వనాథ ఆచారి, ఉత్తమ తబలిస్టుగా బడె సాహెబ్, ఉత్తమ గాయకుడుగా చితంబర రెడ్డిని ఎంపిక చేసి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

బడ్జెట్‌లో వేదావతి ప్రాజెక్టుకు అన్యాయం


ప్రభుత్వానికి రాసిన లేఖను చూపుతున్న సీపీఎం నాయకులు

ఆస్పరి: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌లో వేదావతి ప్రాజెక్టుకు నిధులు కేటాయించకుండా తీరని అన్యాయం చేశారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వీరశేఖర్, హనుమంతు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆస్పరిలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వెనుకబడిన ఆలూరు నియోజక వర్గంలో వేదావతి ప్రాజెక్టు నిర్మిస్తే సాగు, తాగు నీరు కల్పించవచ్చన్నారు. కూటమి ప్రభుత్వం ఆలూరు నియోజక వర్గంలోని వేదావతి, నగరడోణ ప్రాజెక్టులకు ఎటువంటి నిధులు కేటాయించలేదన్నారు. ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ వారు బహిరంగా లేఖ రాశారు. నిధులు కేటాయించకపోతే రైతులను కలుపుకుని ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సీపీఎం నాయకులు బాలకృష్ణ, రంగస్వామి పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేస్తే సత్ఫలితాలు

- మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు


సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీపీ ఎర్ర నాగప్ప

తుగ్గలి: మండల స్థాయి అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే సత్ఫలితాలు సాధించవచ్చని జెడ్పీటీసీ సభ్యుడు పులికొండనాయక్, ఇన్‌చార్జ్ ఎంపీపీ ఎర్ర నాగప్ప అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఇన్‌చార్జ్ ఎంపీపీ ఎర్ర నాగప్ప అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికను చదివి వినిపించారు. మార్చిలోగా గృహ నిర్మాణాలు పూర్తిచేసుకుంటే బిల్లులు అందుతాయని హౌసింగ్ ఇన్‌చార్జ్ డీఈ విజయ కుమార్ తెలిపారు. కొత్త ఇళ్లకు జనవరిలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. బ్యాంకు ఖాతాలకు తప్పనిసరిగా ఎన్‌పీసీఐ చేయించుకుంటేనే ప్రభుత్వ పథకాల రాయితీ సొమ్ము అందుతుందని సబ్ పోస్ట్‌మాస్టర్ భరత్ తెలిపారు. పంటల నమోదు, బీమా ప్రీమియంకు సంబంధించి వ్యవసాయశాఖ అధికారి పవన్ కుమార్ వివరించారు. ఈ సందర్భంగా రీసర్వేతో భూవిస్తీర్ణంలో చాలా తేడాలు వచ్చాయని రాతన, ఉప్పర్లపల్లి ఎంపీటీసీ సభ్యులు శ్రీదేవి, రామదాసు నాయక్ సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. రీసర్వేలో పొరపాట్లు సరిదిద్దేందుకు ఇప్పటికే గ్రామ సభలు నిర్వహించి అర్జీలు స్వీకరించినట్లు డిప్యూటీ తహసీల్దార్ నాగరాజు తెలిపారు. మలివిడతలో మరో నాలుగు రెవెన్యూ గ్రామాలు రీసర్వే చేపట్టనున్నట్లు చెప్పారు. నాడు–నేడు కింద రాతన జెడ్పీహెచ్‌ఎస్‌లో అసంపూర్తి పనులను వెంటనే పూర్తిచేసేలా చర్యలు తీసు కోవాలని మండల కోఆప్షన్ సభ్యుడు చాంద్‌బాషా అధికారులను కోరారు. విద్యుత్ సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని ఆ శాఖ ఏఈ మహేశ్వరరెడ్డి చెప్పారు. జల్‌జీవన్ నిధులు రూ.17.19కోట్లతో 7 గ్రామాల్లో ఇంటింటికీ కొళాయి పనులు జరుగుతున్నాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగేష్ తెలిపారు. తాను బాధ్యతలు స్వీకరించిన తర్వాత రూ.26 లక్షల మండల నిధులు మంజూరయ్యాయని.. వాటిని గ్రామాల అభివృద్ధికి ఇచ్చామని ఎంపీపీ ఎర్ర నాగప్ప చెప్పారు. సమావేశంలో ఎంపీడీఓ విశ్వమోహన్, ఏపీఓ హేమసుందర్, ఎంఈవో–2 రమవెంకటేశ్వర్లు, వైద్యాధికారులు ప్రవీణ్, మినాజ్‌పాషా, పశువైద్యాధికారులు ప్రణీత, వెంకటేశ్వర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమా చేయించుకోవాలి

హాలహర్వి: రబీ సీజన్‌లో పంటలు సాగుచేసిన ప్రతి రైతు పంటల బీమా చేయించుకోవాలని ఏఓ శివశంకర్ సూచించారు. బుధవారం మండలంలోని గూళ్యం గ్రామంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రబీ సీజన్‌లో రైతులు సాగుచేసిన జొన్న పంటకు రూ.297 ఎకరాకు, శనగ పంటకు రూ.420 ఎకరాకు చెల్లించాల్సి ఉంటుందన్నారు. పంటలు దెబ్బతింటే రైతులకు ఇన్సూరెన్స్ వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రీకాంత్, వీఏఏలు గురుస్వామి, రాజేష్, రైతులు పాల్గొన్నారు.

బాల్య వివాహంపై కౌన్సెలింగ్

పత్తికొండ(తుగ్గలి): బాల్య వివాహంపై బుధ వారం అర్బన్ సీఐ జయన్న కౌన్సిలింగ్ నిర్వహించారు. పట్టణంలో బాల్య వివాహం చేస్తున్నారన్న సమాచారం మేరకు బాలిక ఇంటికి పోలీసులు, ఐసీడీఎస్ అధికారులు వెళ్లి విచారించారు. తాము పెళ్లి చేయడం లేదని కేవలం నిశ్చితార్థం గురించి మాత్రమే మాట్లాడుకుంటున్నాయని బాలిక తండ్రి చెప్పారు. దీంతో బాలికను, తల్లిదండ్రులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను సీఐ, ఐసీడీఎస్ అధికారులు వివరించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని అవగాహన కల్పించారు. మైనర్ తీరేంత వరకు వివాహం చేయబోమని బాలిక తల్లిదండ్రుల నుంచి అంగీకార పత్రాలు తీసుకున్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ త్రివేణి పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని నిరసన

వెల్దుర్తి(కృష్ణగిరి): పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని 104 ఉద్యోగులు డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ నాయకులతో కలిసి వెల్దుర్తి పాత బస్టాండ్‌లోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి ప్రభుత్వ తీరుపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెండింగ్ బకాయిలు చెల్లించకపోతే కటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో 104 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, అశోక్, హుసేన్, వెంకటేష్, సీఐటీయూ మండల నాయకులు రాజు, రాముడు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించరాదు

మద్దికెర: మండల పరిధిలోని హంప గ్రామంలో ఐదారేళ్లుగా ఉపాధి పనులు కల్పిస్తూ సక్రమంగా విధులు నిర్వహిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించరాదని గ్రామస్తులు అన్నారు. బుధవారం గ్రామంలో ఉపాధి అధికారులు విచారణ చేపట్టారు. గ్రామస్తులు మాట్లాడుతూ.. ఎలాంటి అవినీతి ఆరోపణలు లేకున్నా ఫీల్డ్‌అసిస్టెంట్‌ను తొలగించాలని అధికారులపై రాజకీయ నాయకులు ఒత్తిడి తెస్తున్నారన్నారు. ఇదెక్కడి న్యాయమన్నారు. జిల్లా అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు. ఫీల్డ్ అసిసెంట్ తిప్పయ్యస్వామి మాట్లాడుతూ.. ఉపాధి అధికారులు రాజీనామా చేయాలని చెబుతున్నారని, సక్రమంగా పనిచేసినా ప్రభుత్వం మారితే విధులు నుంచి ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు.

సస్యరక్షణపై అవగాహన

పత్తికొండ(తుగ్గలి): మండల పరిధిలోని దూదేకొండలో పత్తి పంటను బుధవారం శాస్త్రవేత్తలు పరిశీలించారు. గుంటూరు ఆర్‌ఏఆర్‌ఎస్, ఎల్‌ఏఎం ప్రిన్సిపాల్ శాస్త్రవేత్త రాజారమణి, బనవాసి కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ రాఘవేంద్ర, ఆర్‌ఏఆర్‌ఎస్ నంద్యాల శాస్త్రవేత్త మోహన్‌విష్ణువర్ధన్, రమాదేవి పంట పొలాన్ని పరిశీలించి రైతులకు సలహాలు ఇచ్చారు. ఎకరాకు 12 లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవడం వల్ల పంటను నష్టపరిచే కీటకాల పరిమితి తగ్గుతుందన్నారు. పసుపు, నీలపు రంగు జిగురు అట్టలు పంటలో అక్కడక్కడ ఏర్పాటు చేసుకోవడం వల్ల తెల్లదోమ ఉధృతిని తగ్గించవచ్చన్నారు. తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను రైతులకు వివరించారు. ఏఈఓ రియాజ్‌బాషా, శ్రీనాథ్ ఉన్నారు.

అర్జీలపై విచారణ

మద్దికెర: భూసర్వే చేసిన బురుజుల, హంప, ఎం.అగ్రహారం గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల ద్వారా వచ్చిన 585 అర్జీలపై రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టినట్లు తహసీల్దార్ హుస్సేన్ సాహెబ్ బుధవారం తెలిపారు. హంప, బొమ్మనపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో అధికారులు రైతులతో భూసర్వే గురించి విచారణ చేశారు.

బాషా అంటే పాములు పరార్


పామును పట్టుకుంటున్న బాషా

హొళగుంద: అతనంటే ఎంతటి పామైనా తోక ముడుచుకోవాల్సిందే.. తాచు, నాగు పామైనా సరే. అతనే మండల కేంద్రం హొళగుందకు చెందిన బాషా. బుధవారం బొమ్మగుండనహళ్లి గ్రామంలోని ఓ ఇంట్లో దాక్కున్న నాగు పామును పట్టుకుని ఎవరికి హాని చెయకుండా అడవిలో వదిలేశాడు. హొళగుందలో కట్టెల మిషన్‌లో పని చేసే బాషా ఇప్పటి వరకు వందల సంఖ్యలో పాములను పట్టాడు.

15న జ్వాలా తోరణం

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీరంగనాథ స్వామి దేవాలయంలో ఈనెల 15వ తేదీ కార్తీక పౌర్ణమి సందర్భంగా స్వామివారి గరుడ వాహన సేవ, పల్లకీ ప్రాకారోత్సవంతో పాటు జ్వాలా తోరణం తదితర కార్యక్రమాలు ఉంటాయని ఈఓ వీరయ్య బుధవారం తెలిపారు. భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలన్నారు.